క్లుప్తంగా

డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: నగరంలోని రహదారులపై డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ వివిధ శాఖల అధికారులను కోరారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అచ్చంపేట జంక్షన్ నుంచి కుంభాభిషేకం వరకు డ్రెయిన్ అలైన్‌మెంట్ సమస్యలపై పోర్టు అధికారులు, ఎస్సీకేఎంసీ, స్మార్ట్ సిటీ, ఎన్‌హెచ్‌పీడీ, ఏపీజెడ్‌ఐఎం, అర్బన్ తహసీల్దార్‌లతో కమిషనర్ మహేష్‌కుమార్ సమీక్షించారు. డ్రైన్ నిర్మాణానికి అవసరమైన చర్యలపై ఆయన చర్చించారు. సమావేశంలో పోర్టు అధికారులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అత్యవసర వైద్యంపై అవగాహన



అత్యవసర వైద్యం అందించే విధానాన్ని వివరిస్తున్న వైద్యులు

బోట్‌క్లబ్: అపస్మారక స్థితికి చేరుకున్న వ్యక్తి అత్యవసర వైద్యం అందితే సత్వరం కోలుకునే అవకాశం ఉందని ప్రముఖ వైద్యుడు వెదుళ్ల బాలకృష్ణ అన్నారు. వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా అమెరికన్ హార్ట్ అసోసియేషన్, విశాఖలోని అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక హోటల్‌లో శుక్రవారం రోగికి అత్యవసరం వైద్యం ఎలా అందించాలనే అంశంపై వైద్యులు, నర్సులకు అవగాహన కల్పించారు. గుండె సంబంధ సమస్యలు, పక్షవాతం వచ్చినప్పుడు రోగికి ఎలా అత్యవసరం వైద్యం అందించాలో వివరించారు. శరీరానికి అకస్మాత్తుగా జరిగే పరిణామాలకు వైద్యం అందించే ప్రక్రియలను తెలియజేశారు. వైద్యులు రాజేష్, మనోజ్ఞ, అంజలి పాల్గొన్నారు.

రోటరీ గోల్డ్ సేవలు ఆదర్శనీయం



భాస్కరరామ్‌ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: సమాజ అవసరాలకు అనుగుణంగా రోటరీ గోల్డెన్ జుబ్లీ క్లబ్ చేస్తున్న సేవలు మరువలేనిదని రోటరీ గవర్నర్ ఏకేఎస్ భాస్కరరామ్ అన్నారు. అధికారిక పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన ఈ క్లబ్‌ను సందర్శించి మాట్లాడారు. జిల్లా పరిధిలో ఈ క్లబ్ ఆదర్శప్రాయంగా ఉందని అన్నారు. సీఎస్సార్ నిధులు సేకరించడమే కాక వాటిని సద్వినియోగం చేసుకోవడంలో క్లబ్ చూపిస్తున్న శ్రద్ధ ప్రశంసనీయమన్నారు. క్లబ్ అధ్యక్షులు కృష్ణప్రకాష్, మాజీ గవర్నర్‌లు ఎల్.సత్యనారాయణన్, ఎస్‌వీఎస్ రావు, అసిస్టెంట్ గవర్నర్లు చోడిశెట్టి పద్దరాజు, రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, సభ్యులు భాస్కర్‌రామ్‌ను సత్కరించారు.

వచ్చేనెల 14న జ్యోతిష సదస్సు

కాకినాడ సిటీ: ఏటా అంతర్జాతీయ స్థాయిలో జరిగే జ్యోతిష సదస్సు వచ్చేనెల 14న కాకినాడలో నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి వెల్లడించారు. శుక్రవారం కాకినాడ రామారావుపేట గాయత్రీ శాస్త్రీయ పరిశోధనాలయంలో వింజరపు జనార్దనమ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జ్యోతిష్య శాస్త్రంపై ప్రత్యేక పరిశోధనల ప్రసంగాలు ఈ సదస్సులో ఉంటాయని కమిటీ సభ్యుడు దీక్షితుల సుబ్రహ్మణ్యం వివరించారు.

నలుగురు జూదరుల అరెస్టు

కరప: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. ఎస్‌ఐ నాదు రామకృష్ణ కథనం మేరకు మండలం సిరిపురం గ్రామ శివారులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో ఎస్‌ఐ సిబ్బందితో వెళ్లి దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,970 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

తురగాకు ఎన్టీఆర్ సెంటినరీ పురస్కారం

కాకినాడ కల్చరల్: స్థానిక కళాకారుడు తురగా సూర్యారావుకు ఎన్టీఆర్ సెంటినరీ పురస్కారం ప్రదానం చేశారు. ఎక్స్‌రే సాహిత్య, సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం రాత్రి నిర్వహించిన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో ఆయనను ఈ పురస్కారంతో సత్కరించారు. నగర ప్రముఖులు తురగాను అభినందించారు.

నేడు కరప మండల సర్వసభ్య సమావేశం

కరప: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ కర్రె స్వప్న తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు సమావేశానికి రావాలని ఎంపీడీఓ స్వప్న సూచించారు.

పల్లె ప్రాణం విలవిల



కాకినాడ-రామచంద్రపురం రహదారిలో వేములవాడ వద్ద రోడ్డుకు ఇరువైపులా నీడనిస్తున్న పచ్చని చెట్లు



నిలువ నీడ లేని కరప-చింతపల్లి రహదారి

- కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్న గ్రామాలు
- పదేళ్లలో మూడో వంతు తగ్గిన సాగు
- మేలుకోకపోతే పర్యావరణానికి ముప్పే

పల్లె కన్నీరు పెడుతుందో అని ప్రజాకవి గోరటి వెంకన్న కన్నీటి పర్యంతమై రాసి ఆలపించారు. నాడు ఎందరినో కదిలించిన పల్లె పదాలవి. అభివృద్ధి మాటున ఎండుతున్న పల్లెతల్లి రోదన ఏనాటికీ అర్థం కాని స్థితిలో ఉంది నేటి తరం. శతాబ్దాల తరబడి అమ్మ కట్టిన పచ్చని కోకపై విసుగొచ్చిందో ఏమో పల్లె పుత్రునికి.. చల్లని నీడనిచ్చే ఆ కోకను అంచుల నుంచి మొత్తంగా పీలికలు చేసి కాంక్రీటు మయం చేస్తున్నాడు. ఆ ఫలితాన్నీ ఉష్ణతాపం, వాతావరణ అసమతౌల్యం ద్వారా అనుభవిస్తున్నాడు. పల్లె తల్లికి నిండుతనాన్నిచ్చే చెట్లు, పైర్లను సజీవంగా ఉంచాల్సిన బాధ్యత మనదే అని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఒక చెట్టు నరికితే బదులుగా మరో రెండు మొక్కలు నాటి వృక్షాలయ్యే వరకు కాపుకాయాలి. అలా స్వీయ సంకల్పం పెట్టుకోవాలి.

కరప: పచ్చటి పొలాలు.. మామిడి, కొబ్బరి తోటలతో.. పక్షుల కిలకిల రవాలు, కోయిల కూతలతో స్వర్గసీమల్లా తలపించే పల్లెలు నెమ్మదిగా కాంక్రీటు వనాలవుతున్నాయి. కాలిబాటలు మొదలుకొని, రహదారుల వరకు ఇరువైపులా గుబురుగా ఉండే చెట్ల నీడ ఎంత వేసవిలోనైనా చల్లదనాన్నిచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు. పల్లెసీమల్లో పొలాలు తరిగిపోతూ పట్టణీకరణవైపు పరుగులు పెడుతున్నాయి. తద్వారా దశాబ్దం నాటికీ, ఇప్పటికీ వాతావరణంలో ఎంతో మార్పు కనిపిస్తోంది. గ్రామాల్లో గ్రీష్మ తాపం ఏటేటా పెరుగుతోందే తప్ప తరగడం లేదు. వేసవి ప్రారంభంలోనే ఒళ్లు సుర్రుమంటోందని గ్రామస్తులు అంటున్నారు.

దశాబ్దం ముందు వరకు చల్లని సీమలు..

పదేళ్ల క్రితం వరకూ కాలమేదైనా పల్లె ప్రజలకు కాలుష్యం అంటే తెలియదు. పిల్లకాలువలు జలజలా పారేవి. పైర్లు పచ్చగా పండేవి. పక్షులు కిలకలమంటూ తిండి గింజలు తినేవి. ఎత్తైన భవనం మీద నుంచో, లేదా టెలిఫోన్ టవర్ల పైనుంచో చూస్తే పచ్చని కోకలా పరుకున్న భారీ వృక్షాల నడుమ డిజైన్‌లా అక్కడక్కడా మండువా ఇళ్లు, పెంకుటిళ్లు, పూరిళ్లు కనీ కనపడనట్టు ఉండేవి. ఆ చెట్ల ప్రాణవాయువు పల్లెలను సజీవంగా ఉంచేది. నేడు అదే టవర్ పైనుంచి చూస్తే ఎత్తైన భవనాలు, పక్కా ఇళ్లు, అక్కడక్కడా కొద్ది స్థలంలో ఏవో నాలుగైదు చెట్లు ఇదీ నేటి పల్లె వెలుగు. పచ్చటి పొలాలు రొయ్యల చెరువులుగా, నివాస గృహాలుగా మారిపోతున్నాయి. రహదారుల వెడల్పుతో భారీ వృక్షాల కనుమరుగైపోతున్నాయి.



గొర్రిపూడిలో మామిడితోట మధ్య చక్కని వాతావరణంలో చిన్న ఇల్లు

మూడో వంతు తగ్గిన సాగు విస్తీర్ణం

పదేళ్ల క్రితం మండలంలో సుమారుగా 20 వేల ఎకరాల్లో వరి సాగు చేసేవారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం, చేపల చెరువులు వృద్ధి చెందడంతో 14,443 ఎకరాలకు పడిపోయింది. ఒకప్పుడు రైతులు ఏ కాలంలో, ఏ రుతువులో ఏం జరుగుతుందో పసిగట్టి పంటలు సాగు చేసేవారు. కార్తెలను లెక్కకట్టి వర్షం ఏమేర వస్తుందో చెప్పేవారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో వేసవితాపం పెరిగి, వర్షాలు పడాల్సిన సమయంలో పడక, పంటలు నష్టపోతున్నారు. ప్రజల జీవనశైలిలో వచ్చిన మార్పులతో ప్రతి ఇంటా ఫ్రిజ్, ఏసీల వినియోగం పెరిగి పగటి ఉష్ణోగ్రతలు దాదాపు 44 డిగ్రీల పైబడి నమోదవుతున్నాయి. మనం పురోగమిస్తున్నామా.. తిరోగమిస్తున్నామా అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన సమయం ఇది.

సైన్స్‌పై విద్యార్థులకు మెళకువలు



వేళంగి లైబ్రరీలో సైన్స్ ఆవశ్యకతను వివరిస్తున్న జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరామారావు

కరప: విద్యార్థి దశ నుంచి సైన్స్‌పై అవగాహన కలిగించుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూరి శ్రీరామారావు పేర్కొన్నారు. వేళంగిలోని శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. భౌతికశాస్త్రం, గణితంలోని మెళకువలను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాధికారి పాట్నీడి వెంకటరంగయ్య, ఖండవల్లి గున్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు శుక్రవారం నగరంలోని 10, 14 సర్కిళ్ల పరిధిలోని రమణయ్యపేట, వేగుల పాపయ్యవీధి, రాజేంద్రనగర్ బ్యాంక్ కాలనీ, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఆదివారం కూడా చెత్త సేకరించాలని ఆదేశించారు. అనంతరం 49, 50 డివిజన్లలోని పూడిక తీత పనులను ఆయన పర్యవేక్షించారు.

ఉత్సాహంగా సమ్మర్ క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు అందజేస్తున్న హైస్కూలు ఉపాధ్యాయులు

కరప: మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీలో శుక్రవారం మూడు మ్యాచ్‌లు జరిగాయి. అండర్-19 విభాగంలో కూరాడ, వేములవాడ జట్లు పోటీపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన కూరాడ జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 51 పరుగులు చేయగా, వేములవాడ జట్టు 3.3 ఓవర్లలోనే 55 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా బి.సూర్య (వేములవాడ) నిలిచాడు. నో ఏజ్ లిమిట్ విభాగంలో ముందుగా బ్యాటింగ్ చేసిన హసనబాద్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 48 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత చేజింగ్‌కు దిగిన పందలపాక జట్టు 50 పరుగులు చేసి విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ప్రకాష్ నిలిచాడు. రెండో మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కరప సీఏకే ఫ్రెండ్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 45 పరుగులు చేయగా శీల జట్టు 9.2 ఓవర్లలో 41 పరుగులకు ఆలౌటై పరాజయం పాలైంది. మ్యాన్ ఆఫ్‌దిమ్యాచ్‌గా చంద్రమౌళి(కరప) నిలిచాడు. మ్యాన్ ఆఫ్‌దిమ్యాచ్ అవార్డులను హైస్కూలు ఉపాధ్యాయులు ఆచారి, శ్రీనివాస్ అందజేశారు.

చేసిందే చెప్తున్నాం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కూరాడలో గడప గడపకూ..



కూరాడలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ఓట్లు అడగడానికి కాకుండా చేసింది చెప్పి, చేయాల్సినవి ప్రజలకు వివరించడానికే సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కన్నబాబు కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా శుక్రవారం రెండో రోజు ఆయన స్థానిక నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో కలసి కూరాడలోని అరుంధతీ, బీసీ వీధులలో, శివారు చినమామిడాడ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ సీఎం జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఎవరికి, ఏ పథకం ద్వారా ప్రయోజనం చేకూర్చిందీ ఆయన వివరించారు. గ్రామంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులతో పాటు, ఆలయాల నిర్మాణానికి నిధులిచ్చామన్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు కావాలని అడిగారని, త్వరలోనే వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కన్నబాబుకు పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్, సర్పంచ్ వాసంశెట్టి కొండ, ఎంపీటీసీ సభ్యురాలు గుత్తుల శాంతి, వెలుగుబంట్ల నారయ్య, గుత్తుల బాలాజీ స్వాగతం పలికి ఇంటింటికీ తీసుకెళ్లగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ ముందుకు సాగారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, మద్దూరి భాస్కర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోరమండల్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- సీఎస్సార్ నిధులతో నిర్మించిన అదనపు గదులు, ఆర్వో ప్లాంట్ ప్రారంభం



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: వాకలపూడి, వలసపాకల గ్రామాల్లో కోరమాండల్ ఎరువుల కర్మాగారం సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయని, మరిన్ని సేవలు అందించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. మండలంలోని వాకలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు రూ.25 లక్షలతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను, వాకలపూడి జ్యోతిరావు పూలే కాలనీలో రూ.10.38లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభించారు. ఈ మధ్య కాలంలో కోరమాండల్ సంస్థ సీఎస్సార్ నిధులతో ఎక్కువగా సేవలందిస్తుందోని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో బీసీ, ఎస్సీలు, మత్స్యకారులు ఎక్కువగా ఉన్నందున ఎక్కువ నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అమీర్ అల్వీ, కాకినాడ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువుల ఉత్పత్తితో పాటు కర్మాగారం ప్రాంతంలోని 5 కిలో మీటర్ల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను అత్యధికంగా కేటాయిస్తుందన్నారు. వాకలపూడి హైస్కూల్ హెచ్‌ఎం అభ్యర్థన మేరకు రెండు అదనపు గదులు నిర్మించామన్నారు. బీసీ కాలనీలో 800 కుటుంబాలకు చెందిన సుమారు 2వేల మందికి సరిపడేలా అత్యాధునిక సాంకేతికతతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు. డీఎల్‌డీఓ నారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి పాండు రంగారావు, సీనియర్ నాయకుడు గోపుశెట్టి పద్మజ బాబ్జీ, రంగకుమార్, దినేష్, పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేయనున్న విద్యాకానుక కిట్లను వాకలపూడి హైస్కూల్‌లో పరిశీలించారు.

సామాజిక భవనాలకు మోక్షం

నియోజకవర్గంలో ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న సామాజిక భవనాలకు మోక్షం కల్పిస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల పేర్కొన్నారు. మండలంలోని వాకలపూడి బీసీ (జ్యోతిరావు పూలే)కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించి రహదారులు, డ్రైనేజీలకు ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు పిల్లర్ల దశలో నిలిచిపోయిన సామాజిక భవనాన్ని పరిశీలించి సానుకూలంగా స్పందించి త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. డీఎల్‌డీఓ నారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు, వాకలపూడి నాయకులు పాల్గొన్నారు.

అంటువ్యాధుల నివారణకు చర్యలు



జెడ్.భావారంలో డ్రమ్ములో నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న వైద్యసిబ్బంది

కరప: అంటువ్యాధులను వ్యాప్తిచేసే దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు సూచించారు. నడకుదురు, కరప, జెడ్.భావారం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని గ్రామ కార్యదర్శులకు, పంచాయతీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది సంయుక్తంగా పలు గ్రామాల్లోని రక్షితనీటి ట్యాంకులను శుభ్రం చేయించారు.

ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడిగా శివరామ్‌కుమార్



కార్యవర్గాన్ని అభినందిస్తున్న జిల్లా రెవెన్యూ ఉద్యోగులు, ఆయా సంఘాల ప్రతినిధులు

కాకినాడ సిటీ: ఏపీఆర్ఎస్ఏ కలెక్టరేట్ యూనిట్ 2023-26 మూడేళ్ల కాల పరిమితికి స్థానిక రెవెన్యూ భవన్‌లో శుక్రవారం ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా సీహెచ్ శివరామ్‌కుమార్ (సీనియర్ సహాయకులు, కలెక్టరేట్), కార్యదర్శిగా ఎం.విజయకుమార్ (డిప్యూటీ తహసీల్దార్), అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.పార్థసారధి (డిప్యూటీ తహసీల్దార్), ఉపాధ్యక్షులుగా ఎంటీఆర్ ప్రసాద్, ఎస్‌కేవీ సుబ్బరాజు, సీహెచ్ సంధ్యారాణి, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.వి.రమ్య, వి.రమేష్‌బాబు, ముక్కే రామకృష్ణ, కోశాధికారిగా ఎం.శివరామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సాయిదీపిక, ఎ.రామకృష్ణ, వై.యమున సత్య నగీనాదేవి, సీహెచ్ పవన్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డి.కృష్ణ వ్యవహరించారు. కార్యవర్గాన్ని జిల్లా ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడు పితాని త్రినాథరావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు కె.చంద్రశేఖరరెడ్డి, ఇతర కార్యాలయ సిబ్బంది అభినందించారు. అనంతరం కలెక్టరేట్ యూనిట్ నూతన కమిటీ కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ, ఏవో శ్రీనివాసరావు, డీఆర్వో సుబ్బలక్ష్మిలను మర్యాదపూర్వకం కలిసారు.

కెమేరామెన్‌కు ఆర్థిక సాయం



శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

కాకినాడ సిటీ: ఓ ఛానల్ కెమెరామెన్‌గా పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సప్పా శ్రీనివాస్‌కు ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ప్రతినిధులు శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఫెడరేషన్ అధ్యక్షుడు దుర్గారావు మాట్లాడుతూ శ్రీనివాస్‌ను ఆదుకునేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని అన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

కరప: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో తొమ్మిదేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు సూచించారు. నడకుదురులో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని రంబాల పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గసభ్యుడు పుట్టా వీరప్రసాద్ గాంధీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా పనిచేస్తా

- డీఐపీఆర్వో నాగార్జున్



మంత్రి వేణుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగార్జున్

కాకినాడ సిటీ: జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి (డీఐపీఆర్వో)గా డి.నాగార్జున్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అసిస్టెంట్ డైరెక్టర్ హోదాతో పశ్చిమగోదావరి జిల్లా డీఐపీఆర్వోగా పని చేసిన ఆయన డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతిపై ఇక్కడ డీఐపీఆర్వోగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న బి పూర్ణచంద్రరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగార్జున్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని జిల్లా ప్రజలకు చేరవేసేందుకు, అదే విధంగా ప్రజల అభిప్రాయాలను, ఆకాంక్షలను ప్రభుత్వానికి సమాచార, పౌరసంబంధాల శాఖ ద్వారా తెలియజేసేందుకు కృషి చేస్తానన్నారు. మీడియా సంస్థలు, ప్రతినిధులకు ప్రభుత్వ పరమైన సంక్షేమాలు సమగ్రంగా అందేలా కృషి చేస్తానన్నారు. ఆయనకు ఏఈఐఈ సీ బాబూరావు, డివిజనల్ పీఆర్వో పి.రవి, ఏపీఆర్వో కె.రవి, ఏవీఎస్ జి.ధర్మరాజు, టైపిస్ట్ జి.స్వరాజ్యకుమారి, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

మంత్రి, కలెక్టర్లను కలసిన నాగార్జున్

శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగార్జున్ రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను రామచంద్రపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలోనూ, అదే విధంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఎస్.ఇలక్కియలను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆదర్శప్రాయుడు రఘుపతి



రఘుపతి వెంకటరత్నం నాయుడు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సత్సంగ్ సభ్యులు

కాకినాడ కల్చరల్: రఘుపతి వెంకటరత్నం నాయుడు ఆదర్శప్రాయుడని బ్రహ్మ ధ్యాన సత్సంగ్ జిల్లా అధ్యక్షుడు దండుప్రోలు మహేష్ అన్నారు. స్థానిక బ్రహ్మసమాజంలో సత్సంగ్ ఆధ్వర్యంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతి శుక్రవారం నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం బ్రహ్మసమాజం ఆవరణలో మొక్కలు నాటారు. సత్సంగ్ జాతీయ అధ్యక్షుడు అరవ మణికంఠ గౌతమ్, బాషా, గంధం శంకర్, పావని, లక్ష్మి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: బ్రహ్మ సమాజ ఆద్యుడు రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతిని వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెంకటరత్నం నాయుడు విగ్రహానికి సాహితీవేత్త డాక్టర్ శిరీష, అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, అడబాల సత్యనారాయణ, చంద్రరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: వికాస, ఇగ్నైటెడ్ హెల్పింగ్ మైండ్స్, సంకల్పం హెల్పింగ్ హ్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో వచ్చేనెల నాలుగున ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. స్థానిక వివేకానంద పార్కులో నిర్వహించనున్న ఈ కార్యక్రమం పోస్టర్‌ను వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు, ఆయా సంస్థల ప్రతినిధులు బాషా, ఎం.శ్రీను, గౌతమ్, మణికంఠ రూపొందించగా కలెక్టర్ కృతికా శుక్లా ఆవిష్కరించారు. బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్‌లో భాగంగా 2 వేలు క్లాత్ బ్యానర్లను, అఖిల హరిత సంకల్పంలో భాగంగా వెయ్యి మొక్కలను పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు. అలాగే బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ పోటీల ప్రదర్శనలో భాగంగా ఇంట్లోని పనికిరాని వస్తువుల నుంచి పనికొచ్చే వస్తువులను తయారు చేసిన వారికి ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 2వేలు, తృతీయ బహుమతిగా రూ.వెయ్యి నగదు అందజేస్తామని తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే వారు 90144 00577 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. తయారు చేసిన వస్తువులను జూన్ 3వ తేదీ ఉదయం 10 గంటల లోపు అందజేయాల్సి ఉంటుందని నిర్వహకులు వివరించారు.

అమరావతిలో అన్ని వర్గాలకు ఆవాసం



సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

కాకినాడరూరల్: పేదలకు అమరావతిలో ఇళ్ల స్థలాలు రాకుండా ప్రతిపక్షాలు అడ్డుకున్నా సుప్రీంకోర్టు తీర్పుతో 50 వేల మందికి పట్టాలు పంపిణీ చేసిన నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి అన్నారు. శుక్రవారం ఆమె నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. అమరావతిలో అన్ని సామాజిక వర్గాల పేదలు నివాసం ఉండేలా 50 వేల మంది పేదలు గూడును కలిగి ఉండేలా సీఎం జగన్ చేశారన్నారు. టీడీపీ నెలకొల్పిన ప్పుడు కూడు, గూడు, నీడ అనే నినాదంతో ప్రజల్లోకి వచ్చి విజయం సాధించారన్నారు. చంద్రబాబు ఆ నినాదాన్ని తుంగలో తొక్కారన్నారు.